మంత్రిగారొస్తారు

తొందరగా తల్దువ్వవే అమ్మా... లైమైపోతోంది'

'ఏవిటా గెంతులూ ... అబ్బబ్బ...తలకి నూనె రాయమంటావా—వద్దా? ఏవిట్రా ఇవాళ అంత తొందర?'

'తొందరంటే తొందరే మరి...మాకు మిఠాయిలు పంచిపెడతారు. అల్లా ఆఫీసుకి మంత్రిగారొస్తారు. మరి మా మాస్టర్లు పిల్లలవంతా వెళ్ళొద్దేవిటమ్మా'

'మంత్రిగారికోసమా— మిఠాయిలకోసమా ఈ విందులన్నీ? ఊ...మరి తల అలా అల్లాడిస్తే ఎలా దువ్వను? ఇంకా ఏదీ రాజా, వీరభద్రం రానేలేదు. కాస్త ఉప్మా తిని వెళ్ళు...'

గోపీ వినిపించుకుంటేనా? చొక్కా మీద గుండీ పెట్టుకోలేదు. పాలేనా తాగలేదు. నిన్న బాగా కరిచిందన్న జోడు గురించి ఆలోచించేనా లేదు. ఆదరా బాదరా తొడి గేసుకుని. పుస్తకాల సంచీ భుజాన తగిలించుకుని, వెనక్కి తిరిగేనా చూడకుండా పరుగుచ్చుకున్నాడు.

- శాంత మనసు చిన్న బుచ్చుకుంది. ఏడేళ్ళ పసివెదవలో ఇంత ఉత్సాహమూ మంత్రిగారికోసమేనా? ఏవీ తినకుండా, తాగకుండా వెళ్ళినవాడు ఎప్పటికి వస్తాడో అన్నదే ఆమె ఆలోచనైపోయింది,

'గోపీ...హేయ్...గోపీ' అని పిలిచి, ఎదురుగా కనపడ్డ శాంతతో 'గోపీ వున్నాడాండీ' అని అడిగాడు, తానూ ఓ దేశ నాయకుళ్ళా లాల్చీ, పైజమా వేసుకుని బయల్దేరిన వీరభద్రం.

'ఇప్పుడే వెళ్ళిపోయాడు. ఇంకా మలుపు తిరిగుంటాడేమో?' అన్నమగాని ... మంత్రి

మంత్రిగారొస్తారు!

గారు ఏన్నింటికి వస్తారట?' అడిగింది శాంత.

'అదేమో నాకేం తెల్సు? మా మాష్టారు చెప్పారు నిన్న—మంత్రిగారొస్తారు. తెల్లారేసరికి అందరూ వచ్చేసేయండి. మీరంతా వీధుల్లో నిల్చోవాలి. జై జై అనాలి—అని. అందుకే తొందరగా వెళిపోతున్నాం—' అంటూ గబగబా నడిచిపోయాడు.

వీధిలో నిల్చొని చూస్తోంది శాంత. నిజమే. ఎప్పుడూ ఏడుస్తున్నట్టుండే ఊరు, అవేళ కళకళలాడుతున్నట్టనిపించింది. మనుషులు చాలా హడావిడిగా తిరుగుతున్నారు. ఎప్పుడూ లేంది, తమ ఇంటి ముందునుండి రెండుమూడు జీపులుకూడా వెళ్ళాయి.

హైస్కూలు పిల్లలు, ఎన్సీసీ బట్టలు వేసుకుని, బూట్లు టకటక లాడిస్తూ తీవిగా నడిచిపోతున్నారు. వీధికొసన ఏదో అలంకరిస్తున్నారు కూడా.

ఇంతకీ మంత్రిగారొచ్చేది ఎన్నిగంటలకు అన్నది తెలుసుకుందామన్నది ఆమె తాపత్రయం.

ఇంతలో రాజు అలా వెళ్ళడం గమనించి, పిలిచి అడిగింది.

'తొమ్మిదికి అనుకుంటాను' అన్నాడు రాజు.

'ఇవాళ స్కూలు లేదా?'

'మంత్రిగారొస్తే, స్కూలుంటుందేమిటి? అందుకే మేం పుస్తకాలు పట్టుకెళ్ళట్లేదేమిటి?' ఎదురు ప్రశ్న వేశాడు.

'మంత్రిగారొస్తే స్కూలుండదు ఆ రోజు పాఠాలు సున్నా. బాగానే వుంది. ఐతే, గోపి పుస్తకాలు తీసుకెళ్ళాడేం చెప్మా?' తనలో అనుకున్నట్టు అంది శాంత.

'అదేమో...నే వెళిపోతున్నా' దౌడు తీశాడు రాజు.

ఎండాకాలమేమో, ఉదయం ఆరున్నరకే ఎండ తీక్షణంగా వచ్చేసింది. చెమట్లు పట్టేస్తున్నాయి.

'ఏం చోద్యమమ్మా...ఎప్పుడో తొమ్మిదింటికి మంత్రిగారొస్తే, పిల్లవెధవ పచ్చి మంచినీళ్ళైనా తాక్కుండా తెల్లారేసరికి తుర్రుమన్నాడు. వేలెడు లేడు. వీడికెందుకీ ఉత్సాహం?' అనుకొంది శాంత.

వేలెడు లేడు కనకనే వీడికా ఉత్సాహం. ఈ ఉత్సవాల వెనక రాజకీయాలు తెలియవు కనకనే వాడికా ఉత్సాహం. ఉత్సవ విగ్రహాల్లా ఊరేగే ఊరేగింపులో భేషజాలు వాడికి అందవు గాబట్టే, వాడికీ ఉత్సాహం.

ఈ సభలు, ఈ సమావేశాలు, ఈ పూలదండలు, ఈ బాజా భజంత్రీలు, ఈ వాగ్దానాలు—ఇవన్నీ కేవలం ఒక షో—అని తెలిసిన్నాక, వాడిలా వూరు తెల్లారకముందు పరిగెత్తడు.

భర్త ట్రైనింగ్‌కి వెళ్ళగా, గోపిని దగ్గిర పెట్టుకుని, ఒక్కర్తీ కాలం వెళ్ళబుచ్చుతోంది శాంత.

రెండో క్లాసు చదువుతూన్న గోపికి మించిన బరువున్నాయి వాడి పుస్తకాలు. అన్నీ రోజూ పట్టుకెళ్ళాలంటాడు. వాడు తినే నాలుగు మెతుకులూ, ఈ పుస్తకాల మోతకి సరి. ఇహ నీ కుర్రసన్నాసి ఏం చదువు వెలగబెడతాడు? స్కూలు వూరి చివర. దాదాపు మైలు దూరం, ఈ భారంతో వాడు వెళ్ళిరావడమే గగనమైతే—ఇహ చదువేమిటి?

స్కూల్లో మాష్టర్లేం చెబుతున్నారో, వీడేం నేర్చుకుంటున్నాడో, అడగడానికి వీల్లేదు.

అలిసిపోయి, నిస్త్రాణగా, వాడిపోయిన తోటకూర కాడలా గోపీవచ్చి, పుస్తకాల సంచీ మూలపడేసి, అరుగుమీద 'ఉస్' మని చతికిలబడేప్పటికి, శాంత కళ్ళల్లో నీళ్ళు తిరిగేవి.

'ఎందుకొచ్చిన చదువిది? వాడి ప్రాణానికి సుఖంలేక పోయాక? రెండు రూపాయలు పోతే పోయాయి. ఇంటిదగ్గరే ప్రైవేటు చెప్పిస్తేనో—' అంటే

'మంచిదానివే, పిల్లలు పదిమందిలో తిరక్కపోతే, ఏవన్నా వచ్చొస్తాయా? దూరమని, దగ్గిరని, చిన్నపిల్లాడని—ఆలోచిస్తే, చదువులెలా వస్తాయ్? పొరుగూరునుండి వచ్చి చదువుకుంటున్నారు పిల్లలు. మరి వాళ్ళమాటేమిటంటావ్? చదువుతూన్నది, బాధపడుతూన్నది మన పిల్లవాడొక్కడే కాదు కదా—' ఇది నారాయణరావు జవాబు.

'ఏమిటో మీరలా అంటారుగానీ, వాడిపోయిన ముఖంతో, కుర్రవెధవ వుసూరుమని ఆ ఎండలో అంతదూరంనుంచి, బండెడు పుస్తకాలతో, ఒళ్ళంతా చెమట్లతో వస్తూంటే, చూళ్ళేక నా మనసు తరుక్కుపోతూంది. మీకేం ... ఎన్నైనా చెప్తారు. ఆడదైపుడితే తెలిసేది తల్లి మనసు.' శాంత బాధపడేది.

ఇంటి దగ్గర ప్రైవేటు చెప్పించడానికి నారాయణరావు అభ్యంతరం చెప్పలేదుగానీ, స్కూలుకుమాత్రం ప్రతిరోజూ వెళ్ళి రావాలన్నాడు.

ఉదయం ఎనిమిదికి, ఒకచేత్తో కేరేజీ, మరోచేత్తో పుస్తకాలసంచీ పట్టుకుని



స్కూలుకెళ్తే సాయంత్రం అయిదు దాటాకగాని, ఇల్లు చేరడు గోపీ. మరి నడవాలా?—వచ్చి నీళ్ళు పోసుకుని, బట్టలు మార్చుకుని, కొంచెం పాలు తాగేప్పటికి ప్రైవేటు మాష్టరు రడీ.

ఆరునుండీ, ఏడున్నర వరకూ ఆయనేం చెప్తాడో, అలిసిపోయి, కూరుకుపోతూన్న కళ్ళతో వీడేం వినేవాడో... ఏవీ అంతు పట్టదు శాంతకి.

'అసలెందుకొచ్చిన చదువులివి? ఎంచక్కా తెలుగు, లెఖ్ఖలు నేర్చుకుంటే చాలదా? అలా ఐతే, తానే ఇంటిదగ్గర నేర్పగలదే'—ఇదీ ఆమె ఆలోచన.

'ఇందిరాగాంధీకి జై. నెహ్రూ చాచాకీ జై...' అనే కేకలు విని, వీధి కేసి చూసింది.

గర్ల్సు స్కూలు పిల్లలు రంగు రంగుల బట్టలు వేసుకుని, జెండాలు పట్టుకుని, బారులుతీరి వెళ్తున్నారు. వెనకగా మేష్ట్రమ్మలు కూడా, ముసిముసిగా నవ్వుకుంటూ, వాళ్ళలో వాళ్ళేవో కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు. హిందీ టీచరమ్మతో, కొత్తగా చేరిన సైన్సు అసిస్టెంట్ సూర్యం ఏదో జోకు వేశాడు. ఆవిడ విరగబడి నవ్వుతోంది—. ముఖం మీద పడ్డ వెంట్రుకల్ని సరిచేసుకుంటూ, చెదిరిన పవిటను చూడనట్టు నటిస్తూ.

ఆ గుంపు వీధిమలుపు తిరిగాక, ఇంట్లోకొచ్చి, స్నానం అయిందనిపించి, ఇంత కాఫీ తాగింది శాంత. గోపీ తినకుండా వెళ్ళిన ఉప్మా, తినబుద్ధి వెయ్యలేదు ఆమెకి.

'చంటివెధవ ఆకల్తో వెళ్ళగా, నేను కూడు మింగనా' అనుకుని, గబగబా వంట ప్రయత్నం చేసింది. గోపీకి ఇష్టమని టొమాటో పెరుగుపచ్చడి, కందిపప్పు, చారు రడీ చేసింది. బంగాళాదుంపలు తరిగి ఉడకబెట్టడానికి స్టౌమీద పెట్టి, టైం చూసింది.

తొమ్మిది కావస్తోంది. ఇప్పుడో మరో ఘడీకో మంత్రిగారొస్తారు. ఓ గంటలో తతంగమంతా ముగుస్తుంది. పది దాటాక గోపి వస్తాడు. దుంపలు ఉడికాక, తొక్కలు వొల్చేసి వుంచేస్తాను. గోపి నీళ్ళుపోసుకుని, బట్టలు మార్చుకునేలోగా అవి దోరదోరగా వేయించి, వేడివేడిగా పెట్టేస్తాను...ఇలా అనుకుని, పని చకచక కానిచ్చింది శాంత.

"బరకగా ఉండే పాత కాలపు పళ్ల పొడులు మీ చిగుళ్లకు పళ్లకు చెరుపు చేస్తాయి..."



కాల్గేట్ టూత్ పౌడరుతో మీ చిగుళ్లను, పళ్లను కాపాడుకోండి. చెడు శ్వాసను అరికట్టండి!

కాల్గేట్ టూత్ పౌడరుతో అధునాతన దంత సంరక్షణ పొందు పెనది—దాని చల్లని ఉల్లాసకరమైన రుచిని మీరు ఎంతో మెచ్చుకుంటారు! మీ కుటుంబం కోసం ఈ నాడే ఒక డబ్బా కొనండి!

ఋతుక్రమం ఆలస్యమైతే?

విచారపడవద్దు ప్రఖ్యాతిగాంచిన "దేవిపిల్సు" వాడండి

'దేవి పిల్సు ముఖ్యంగా ఆలస్యమైన, క్రమముగాకాక పోయిన, బాధతోకూడిన, లేక ఆగిపోయినబహిష్టకు దేవిపిల్సు బాగుగ గుణమిచ్చును

ప్రతిచోటదొరకును

1 అన్నిసందర్భములలోను శీఘ్రముగాను, అమోఘముగాను పనిచేయును
2 ఏస్థితిలోను ఆరోగ్యమునకు ఎట్టిహాని కలిగింపదు

FULL COURSE 28 TABLETS Rs.11/-
HALF COURSE 14 TABLETS Rs.6.50

Mfrs:- SEENU & Co., MADRAS-81

Available at all leading Chemists & Druggists.

కే. టి. కృష్ణమూర్తి ఆచార్యిగారి

"మేల్ మాయిల్ మందు"

నల్లరంగు, తెల్లరంగు, పొడలు, దద్దులు, గజ్జి మరియు చెడ్డనీరు వ్యాపించినందున ఏర్పడు పిరుగు పుట్టించు రణములు మొదలగు

దీర్ఘకాల చర్మరోగములకు ఉత్తమ నివారిణి

వివరములకు

సిద్ధ డాక్టర్ కే. టి. కృష్ణమూర్తి ఆచార్యి & సన్సు

5/22, మేల్ మాయిల్ (P. O.) N. A. Dt

పదిది దాటిపోయింది. ఈలోగా వీధిలోకి ఓ అరడజను పార్టీనా వెళ్ళొచ్చింది. జనం వివరిమట్టుకు వారు, దేశాన్నుద్ధరించేసేంత గాభరాలో పడిపోయి, వడివడిగా పోతున్నారు.

'అప్పుడే పద్నాటిపోయింది వెధవ.. ఆకలికేం గిలగిల్లాడిపోతున్నాడో? ఎందుకొచ్చిన మీటింగది...పొద్దున్న వెళ్ళినవాడు ఇంతవరకూ ఏం తినకపోతే ఏమైపోవాలి—' విలవిల్లాడిపోయింది శాంత.

లోపలికి వెళ్ళి, గబగబా ముక్కలు వేయించి, గోపీ కేరేజితీసి, అందులో వాడికోసం భోజనం సర్దేసి, ఓగ్లాసుడు మజ్జిగ తాగి, ఇంటికి తాళంపెట్టి కేరేజీ తీసుకుని బయల్దేరింది స్కూలుకి. వాడికి నాలుగు మెతుకులు తినిపించకపోతే, ఆ తల్లిమనసు వూరుకోనంది.

రోడ్లు జండలతో అలంకరించారు. జీపులు, ఎన్నడూ చూడని కార్లు, హడావిడిగా తిరగుతున్నాయి. ఖద్దరు పంచలు, గాంధీ టోపీలు కొల్లలుగా, గాంధీగారి గురించీ, యాహ్యాఖాన్, భుట్టోల గురించీ— ఏవేవిటో మాట్లాడేసుకుంటున్నారు. ఇద్దరు ఫోటోగ్రాఫర్లతో, పంచాయతీ ప్రెసిడెంటుగారు—

'ఇదిగో...మరిప్పుడే చెప్తున్నాను. మరి మంత్రిగారి పక్కన మనం నిలవగానే పిటుకు సిటుకుమని నొక్కేయాలి. పేపర్లో మనబొమ్మ పడిపోవాల. మరేటనుకున్నారో మనంటే ... అన్నరేగానీ ... కాపీల్తాగేరా... దానికేట్నండీ...తాగితే మరితాక్కూడదేటి? మరి కుపింత పుచ్చుకోవయ్యా...మీకు తెల్దుగానీ...మరి...ఏది...మా బావమ్మర్ది నేడూ... యోడండీ...గేనపురంమెంబరండి...వాడు... మీరు కాపీలకిలగౌతన్నరుగానీ...ఒద్దైతే నండీ...ఓసీసా ఎట్టేసినా ... ఏదీ...అదేనే వయ్యా ... ఉఫ్ మని ఊదెయ్యడూ ... హహ్హహ్హా...' అంటూ విరగబడి నవ్వాడు.

'ఊ...మన్లో మనమాట...మా బావమర్ది యూదన్నుకొస్తేగాని, ఇలాంటివి తెల్దు.. పమానికి తెలిసిందిగానీ...నేపోతే...తిరకాసైపోయేది ... ఫ్లరేయ్ ... యౌవ్ డాడా ... నత్తైవూ ... ఇల్లొస్తేంధర్న రవిమ్మా ... మన మంత్రిగారి బోసిలియాక ... ఏదీ ... అదేరా ... నీకు తెల్దాగానీ... మన సుందరయ్యా నేడూ...ఆడికి పేస్తా నాస్పెస్పి

మంత్రిగారొస్తారు!

నాసని...దాన్నిగ తరగ...ఈదెబ్బతో మనూరి ఇస్కూలు, పట్నం కాసింగువారకు రోడ్డు, ఆ వడవటి సెరువు... ఈ కాంట్రాక్టులన్నీ వన సేతిలోకి రావాలి...' అలిసిపోయి, ఆగిపోయి, పోలీసు జీపుమాసి, గబగబా మెట్టు దిగాడు ప్రెసిడెంటు.

'నాస్కారం యస్సైబాబూ...ఏటిలా దయసేస్నేను ... ఓ ... మంత్రిగారొస్తారు కదూ ..' ఒదిగిఒదిగి జీపుపక్కన నిల్చున్నారు.

'ఔనయ్యా! అది సరేగానీ, మంత్రిగారి కారు మధ్యలో రిపేరొచ్చింది. ఎండలో మంత్రిగారు కతకతలాడి పోతున్నారు. ఓ మంచినీళ్ళైనా దొరకవ్. ఏం వూరయ్యా ఇదీ...మరి తొందరగా ఎదురెళ్లండి...' ఆధికార హోదాలో అన్నాడు యస్సై.

'ఎంత మాటెంతమాట. ఎండ ఫెరేల్మని పోతంటే. ఇద్గో ఇప్పుడే బయలెల్తున్నాను.' అంటూ ఓ జీపునిండా తినడానికి, తాగడానికి సామాన్లు నింపేసి, కన్నుమూసి తెరిచేలోగా మాయమయ్యాడు ప్రెసిడెంటు.

ఈ మాటలు వింటూన్న శాంత 'ఇంకా ఎంత సేపౌతుందో మంత్రిగా రొచ్చేసరికి ఇప్పటికే పదకుండు దాటుతోంది. ఇంతా ఇంతా స్కూలు పిల్లలు, ఈ ఎండలో ఏమైపోవాలి? మంత్రిగా రొస్తున్నారనే సరదావే తప్ప, తమకేం ఒరుగుతుందో అక్కర్లేదు కదా ఈ పసివాళ్ళకి. మంత్రిగారు కార్లో కూర్చుని ఎండబాధ అనుభవించేస్తున్నారట. జీపునిండా తినుబండారాలు కూల్ డ్రింక్స్ వెళ్లాయి. లోటికేడులేని ఈ నోరులేని పిల్లలేం తిన్నారో, ఈ ఎండలో ఎలా నిలబడ గలుగుతారో ఎవరికీ అక్కర్లేదు. ఏం మనుషులో—' అనుకుంది మనసులో, అక్కడచేరిన పిల్లలగుంపులో తన గోపీని వెతుక్కుంటూ.

గోపీ అక్కడ కనబడలేదు. ఎలిమెంటరీ; మిడిల్ స్కూలు పిల లందరూ, మైదానంలో వున్నారవి విని, ముఖానపట్టిన చెమటని తుడుచుకుంటూ. ఆయాసంగా అక్కడికి చేరింది.

విశాలమైన ఆ మైదానంలో అరంగుళం మేర నీడలేదు. ముఖాలు వేళాడేసుకుని, తలలో పట్టిన చెమట, ధారలుగా ముఖం మీంచి, చెంపలమీంచి — చొక్కాలమీద పడుతూంటే, దిగాలుపడి, ఇంతింత వెధవలూ నిల్చొని వున్నారు.

మంత్రిగారికోసం పెద్ద వేదిక కట్టారు. దానిమీద, మెత్తని పెద్ద పెద్ద కుర్చీలు అమర్చారు. ఎక్కణ్ణుంచో కరెంటుతెచ్చి, మూడు స్టాండింగ్ ఫాన్లు ఫిక్స్ చేశారు.

ఆ చల్లని నీడల్లో ఆశీనులయ్యే మంత్రిగార్ని తలుచుకుని, ఇలా ఎండల్లో మాడిపోతున్న ఈ చంటివెధవల్ని చూసి శాంతగుండె చెరువైపోయింది.

'ఎవరెలాపోతే తనకేం? తన గోపీ ఎక్కడున్నాడో' అనే స్వార్థం ఆమెలో కలిగింది. ఆమెకళ్ళు వాడికోసం గాలించాయి. వాడెక్కడా కనబడలేదు. ఆమెలో ఆత్రుత ఎక్కువైంది. ఎవరో వెళ్తూంటే అడిగింది.

'చిన్నపిల్లల ఒడిపిల్లలేనా ... అదిగో అక్కణ్ణిల్చున్నారే వాళ్లే. అందులో మీ అబ్బాయి లేడా?'

'లేడండీ...'

'లేకపోవడ మేమిటి? వుంటాడు చూడండి. పిల్ల స్నానులు ఎఅడమన్న చోట వుంటారు గనకనా? ఏ చెట్టుకింద చేరి ఆడుకుంటున్నారో...' అంటూ చక్కాపోయాడు చొక్కారావు. అవునుమరి కాస్త పెద్దచొక్కా వేసుకున్న అతనిపేరు అదే ఐవుండాలి.

ఇంతలో కొంతమంది ఆదరాబాదరా వేదికమీద చేరారు. అందరి దృష్టీ అటు మళ్లింది. మైకు పలికింది.

'—మంత్రిగారి కారు పాడైంది. తోవలో వున్నారు. మరోగంటలో వారు రానున్నారని చెప్పడానికి సంతోషిస్తున్నాం. ఎవరూ వెళ్ళిపోకండి. మంత్రిగారొస్తారు. పిల్లలకి మిఠాయి పంచిపెడతాం—'

'ఇంకా ఎంతసేపౌతుందో భగవాన్. గోపీ కనిపిస్తే, హాయిగా ఇంటికి తీసుకుపోదును—' అనుకుంది నాలుగు దిక్కులూ చూస్తూ శాంత.

వీరభద్రంగాని, రాజుగాని కనబళ్లేదు. 'వీళ్ళు ముగ్గురూ తప్పిపోలేదు కదా—' అని శాంత, వెర్రెత్తిందాన్లా ఆ ప్రాంతమంతా తిరిగింది. ఎక్కడా వాళ్ల జాడ లేదు.

మరోగంట గడిచింది. మంత్రిగారు ఊళ్లోకి వచ్చారనేవార్త నిమిషాల్లో చేరింది సభాస్థలికి. ఇక్కణ్ణుంచి ఎవరో తరుము

తున్నట్టు, జనమంతా వూళ్ళోకి పరిగెత్తారు.

పిల్లలు కూడా పోలోమని, హోరని–గోలచేస్తూ, ఏదో వెర్రి ఉత్సాహంతో, కేకలేస్తూ పరిగెత్తారు. అందులో గోపీ ఎక్కడ వున్నాడని వెతుకుతుంది శాంత? లేక తామకూడా ఆ గుంపువెనక ఎంతకని పరిగెడుతుంది?

మంత్రిగారు భోజనం చేశాక, సభ ప్రారంభిస్తారట. ఎప్పుడో ఉదయం ఏడి మిదికి పక్కవూళ్ళో కాస్త ఉపాహారం తీసుకున్నారట.

అంచేత జనం, స్కూలు పిల్లలూ అపరిమితానందంతో, అమిత భయభక్తులతో, ఆయన భోజనం చెయ్యడం— తమందరికీ ఏంతో ఉపకారమైనట్టుగా, నిల్చున్నారు పంచాయతీ ఆఫీసుబయట ఎండలో.

మరో గంటకి తిరిగీ సభాస్థలం అంతా జనంతో నిండిపోయింది. మనుష్యులు ఒకర్నొకరు తోసుకుంటూ, జాగాలు చేసుకుంటున్నారు. ఆ తోపులాటలో, శాంత చేతిలో కేరేజి కిందపడి, విడిపోయింది. వండినవన్నీ నేలపాలైనాయి. అంతవరకూ కనబడని ఓ కుక్క ఆదరాబాదరావచ్చి, ఆ ఆహారాన్ని హాయిగా లొట్టలేస్తూ ఆరగించింది.

శాంత మనసు గిలగిల కొట్టుకుంది, గోపీ కనబళ్ళేదు. వాడికోసం తెచ్చినది ఇలా మట్టిపాలైంది.

'మంత్రిగారొస్తే వీడికి కలిసి వచ్చిందేమిటి?' కసిగా అనుకుంది మనసులో శాంత.

సరిగ్గా ఆ సందంటే అయిదే నిమిషాలు మంత్రిగారు మాట్లాడారు. శాంతకి మంత్రిగార్ని చూడాలనే దృష్టిగాని, ఆయన పలుకులు వినాలనే ధ్యాసగాని కలగేలేదు.

'గోపీ ..ఎక్కడికెళ్ళావ్ నాయనా… ఈ ఎండలో, ఈ జనసమ్మర్దంలో నిన్నెక్కడని వెతకను బాబూ…' ఆమె మాతృహృదయం క్షోభించింది కళ్ళల్లో నీళ్ళు ఉప్పెనగా బయటకుబికాయి.

'…కాబట్టి మీరంతా త్యాగం చెయ్యాలి ఒకపూట భోజనం మానైనా, దేశానికి కొంత సేవచేయాలి…. జేవ్ … జేవ్….' తిన్న మసాలా కూరల వాసనలు, తేన్పుతో ముక్కుపుటాల్ని ఆనందపరచగా, నిర్వికారంగా, తేజోమయుంగా, మంత్రిగారు సుభాశీనులయ్యారు.

జనం తన్మయంతో చప్పట్లవాన కురిపించారు. వేదిక ఖాళీ అయింది. ఎవరి మట్టుకువారు, హడావిడిగా నడిచిపోయారు.

'గోపీ ఏమైనాడు' ఇదే ఆలోచన శాంతలో గింగుర్లు కొట్టింది. పిల్లల్నడిగింది. మాష్టర్లనడిగింది. అందరూ— ఇక్కడే వుంటాలనీ, మేం చూశామే—అని అన్నారేగాని, గోపీ ఎక్కడా కనబడేలేదు శాంతకి.

ఖాళీ కేరేజీతో, ఉసూరుమంటూ, బరువైన గుండెతో గోపీ ఏమైపోయాడో అనే బెంగతో, ఇంటి గుమ్మంలో అడుగు పెట్టిన శాంత మనసు ద్రవించి, సముద్ర కెరటాల్లా దుఃఖం ముంచుకొచ్చింది అక్కడి దృశ్యం చూసి.

అరుగుమీద, పుస్తకాల సంచీ తలకింద పెట్టుకుని, మట్టి కొట్టుకుని, నీరసించి, పీక్కుపోయిన ముఖంతో, ముడుచుకుని పడుకున్న గోపీనిచూసి, ఆమె ఆగలేకపోయింది.

'గోపీ…లేనాయనా…ఇదేం ఖర్మరాబాబూ ఇలా నేలమీద పడుకున్నావ్ … ఎంతసేపైందిరా నాన్నా వచ్చి … పాపిష్టిదాన్ని… నీకోసం వచ్చాననే అనుకున్నానుగాని…నా కోసం నువ్వు వచ్చి వుంటావనే ఆలోచనే రాకపోయిందిరా నాకు…' ధారా ప్రవాహంగా కురుస్తూన్న కన్నీటిని తుడుచుకోనైనా తుడుచుకోకుండా, గోపీని ఒక్క ఉదుట్న గుండెలకు హత్తుకుంది.

గోపీ కళ్ళుతెరిచి, నీరసంగా శాంతని చూశాడు. తల్లిని చూడగానే వాడిలో నీరసం ఉఫ్ అని వూదినట్టు ఎగిరిపోయింది.

'అమ్మా…అమ్మా…ఎక్కడికెళ్ళావే… ఇలా ఇక్కడే గంటైంది పడుకున్నానే… ఆకలేసి పోయిందే … కాళ్ళు నొప్పెట్టి పోయాయే … అబ్బ ఎంతెండనుకున్నావ్… అమ్మా … మంత్రిగారొచ్చారే, మాకు మిఠాయిలు పంచారే…! అంటూ కుడిచేయి పిడికిలి విప్పాడు.

బంకపట్టి, మట్టికలిసిన మైసూరుపాక్ ముక్కంత పిప్పరమెంటు బిళ్ళ ఉంది.

'రెండిచ్చారే. ఒకటి నేం తినేశాను. ఇది . నీకు…'

హృదయం కరిగిపోయి, కన్నీళ్ళుగా ప్రవహిస్తూంటే, గోపీ నంకబెడుతూ 'రా బాబూ' అనకుంది శాంత ●